# వరంగల్ వాయిస్
Evening Daily
www.warangalvoice.net
వరంగల్ | సంపుటి : 03 | సంచిక : 289 | గురువారం | 30 మే 2024 | పేజీలు : 08 | వెల రూ. 5





## ప్రభుత్వ కార్యాలయానికి తాళం

జీతాలు చెల్లించాలంటూ జీపీ ఉద్యోగుల ధర్నా

8 లో..

# కళాతోరణం జోలికొస్తే.. ఖబడ్దార్





వివరాలు 2లో..

అది కాకతీయుల స్ఫూర్తి చిహ్నం

రాజముద్రనుంచి దానిని తొలగించడంపై ఆందోళన

నిరసనలు, ధర్నాలతో హోరెత్తిన ఓరుగల్లు

సీఎం రేవంత్ నిర్ణయంపై తీవ్ర వ్యతిరేకత

రాష్ట్ర ప్రభుత్వ రాజముద్ర నుంచి కాకతీయుల కళాతోరణం తొలగించడంపై ఓరుగల్లు ప్రజలు భగ్గుమంటున్నారు. కళాతోరణం జోలికొస్తే.. ఖబడ్దార్ అంటూ హెచ్చరిస్తున్నారు. ఓరుగల్లు అస్థిత్వానికి, ఆత్మగౌరవానికి విఘాతం కలిగిస్తే కాకతీయుల గడ్డ సహించబోదంటున్నారు. కళాతోరణం తొలగించి ఓరుగల్లు కీర్తిని తగ్గించాలని చూస్తే ఊరుకునేది లేదంటున్నారు. సంస్కృతి విచ్ఛిన్నాన్ని సహించబోమని తేల్చి చెబుతున్నారు. కళాతోరణం అంటే రాతి కట్టడం కాదని అది కాకతీయ రాజుల స్ఫూర్తి చిహ్నం అని గుర్తు చేస్తున్నారు. ప్రజా పాలనకు కాకతీయ రాజులు పెట్టింది పేరంటున్నారు. తెలంగాణ వారసత్వ సంపద, గుర్తింపును మంటగలిపేలా నిర్ణయం తీసుకున్న సీఎం రేవంత్ రెడ్డి సర్కార్ పై మండిపడుతున్నారు. చారిత్రక ఆనవాళ్లు చెరిపేసేందుకు జరుగుతున్న కుట్రలపై అగ్గిమీద గుగ్గిలం అవుతున్నారు. ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ పెద్ద ఎత్తున నిరసనలు, ధర్నాలకు సిద్ధపడ్డారు. అధికారిక రాజముద్రనుంచి కళాతోరణం తొలగింపు నిర్ణయాన్ని ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని సూచిస్తున్నారు. లేకుంటే ఓరుగల్లు నగరం నిరసనలు, ధర్నాలతో హోరెత్తుతుందని హెచ్చరిస్తున్నారు. **- వరంగల్ వాయిస్, వరంగల్**



8లో

## కౌంటింగ్‌కు కట్టుదిట్టమైన ఏర్పాట్లు

రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ పి.ప్రావీణ్య

అధికారులతో కలిసి ఏర్పాట్లపై సమీక్ష




8లో

## గ్రూప్-1 పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు


హనుమకొండ జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్



## తగలబడిన డంపింగ్ యార్డ్

ఉర్సు గుట్ట ప్రాంతంలోని డంపింగ్ యార్డ్ గురువారం తగలబడింది. పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. దట్టంగా పొగలు వ్యాపించాయి. దీంతో చుట్టు పక్కల ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఫైర్ ఇంజన్ వచ్చి మంటలను ఆర్పింది. 32వ డివిజన్ కార్పొరేటర్ పల్లం పద్మ-రవి, నరగ శీను, చింత కుమార్, వరి కొప్పుల రాజు, భాగ్యక్కతోపాటు స్థానికులు అక్కడికి చేరుకొని ఆందోళన చేశారు. డంపింగ్ యార్డ్ తొలగించాలని డిమాండ్ చేశారు. **-వరంగల్ వాయిస్, వరంగల్**

# కళా తోరణం జోలికొస్తే.. ఖబడ్దార్



**అది కాకతీయుల స్ఫూర్తి చిహ్నం**

**రాజముద్రనుంచి దానిని తొలగించడంపై ఆందోళన**

**నిరసనలు, ధర్నాలతో హోరెత్తిన ఓరుగల్లు**

**సీఎం రేవంత్ నిర్ణయంపై తీవ్ర వ్యతిరేకత**

**వరంగల్ వాయిస్, వరంగల్ :** రాజముద్ర నుంచి కాకతీయ కళాతోరణం చిహ్నాన్ని తొలగిస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని తెలంగాణ ప్రజలు, మేదావులు, చరిత్రకారులు, కవులు, కళాకారులు, రచయితలు, మహిళలు, విద్యార్థులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. తెలంగాణలో ఉమ్మడి వరంగల్ జిల్లాకు ఉన్న ప్రధాన్యాన్ని తగ్గించేందుకు చేస్తున్న కుట్రలను ఎండగడుతున్నారు. సంస్కృతి, వారసత్వ సంపద గుర్తింపును మంటగలిపేలా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ప్రతిపక్ష బీఆర్ ఎస్ పార్టీతోపాటు బీజేపీలు ముక్త ఖంఠంతో ఖండిస్తున్నాయి. ఇప్పటికే అన్ని వర్గాల ప్రజలనుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. పాలనను పక్కన బెట్టి రాజముద్ర మార్పులను ముందేసుకున్న కాంగ్రెస్ పార్టీపై స్థానికులు మండిపడుతున్నారు. కాకతీయ కళాతోరణం రాచరికం కాదు..మా ఓరుగల్లు రాజసం అంటూ గుర్తు చేస్తున్నారు. ఇప్పటికే బీఆర్ ఎస్ ఆధ్వర్యంలో ఖిలా వరంగల్ లోని కాకతీయ తోరణం ఎదుట పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించగా నేడు బీజేపీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమాల్లో ఓరుగల్లు ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొంటూ తమ సంఘీబావం ప్రకటిస్తున్నారు. రాజముద్రనుంచి కళాతోరణాన్ని ఎట్టి పరిస్థితిలో తొలగించరాదంటూ సూచిస్తున్నారు. ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తే తగిన బుద్ధి చెబుతామంటూ విద్యార్థులు హెచ్చరిస్తున్నారు. ఈ విషయంలో రేవంత్ సర్కార్ పునరాలోచన చేయాలని సూచిస్తున్నారు.

## తెలంగాణ ఆత్మ గౌరవ ప్రతీక :

**– గంట రవికుమార్, బీజేపీ జిల్లా అధ్యక్షులు**

తెలంగాణలో కొత్తగా కొలువుదీరిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సమస్యలను గాలికి వదిలేసి రాజముద్ర నుంచి కాకతీయ కళాతోరణం తొలగించేందుకు కుట్రలు చేస్తోందని భారతీయ జనతా పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ ఆరోపించారు. కళాతోరణం జోలికొస్తే ప్రజాగ్రహానికి గురి కాక తప్పదని హెచ్చరించారు. బీజేపీ వరంగల్ జిల్లా పార్టీ ఆధ్వర్యంలో గురువారం ఖిల వరంగల్ కోటలోని కాకతీయ కళాతోరణం ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం తీరుపై గంట రవికుమార్ నిప్పులు చెరిగారు. చరిత్ర పట్ల అవగాహన లేని వ్యక్తి సీఎంగా ఉండటం మన దురదృష్టం అన్నారు. పాలనా సరిగ్గా చెయ్యడం చేతకాక ప్రజల మనోభావాలతో ఆటలాడాలని చూస్తున్నారని మండిపడ్డారు. కాకతీయ కళ తోరణం అంటేనే ఓరుగల్లు ప్రజల పౌరుషానికి ప్రతీక, అస్తిత్వనికి చిరునామా అన్నారు. కాకతీయ కళ తోరణంలో రాజసం ఉంది తప్ప రాచరికం లేదన్నారు. కాకతీయుల కళా తోరణంలో సాంస్కృతిక కళా సంపద, ప్రాచీన ఆధ్యాత్మిక శోభ సంతరించుకుందన్నారు. కాకతీయుల పాలనలో ఈ ప్రాంతమంతా సస్యశ్యామలం, జలకళ, శిల్పకళ, నృత్యకళ, నాగరికత, పాడి పంటలు, పశుసంపద, పచ్చని మాగాణి ఇలా అన్ని కళా రంగాలకు పుట్టినిళ్లుగా విరాజిల్లిందరి గుర్తు చేశారు. శిల్పకళకు రామప్ప, నృత్యకళకు ప్రేరణి శివతాండవం, జలకళకు గొలుసు కట్టు చెరువులు నిదర్శనమన్నారు. ప్రభుత్వం తన నిర్ణయాన్ని మార్చుకోకుంటే బీజేపీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఉవ్వెత్తున ఉద్యమాన్ని చేసేందుకు కూడా వెనుకాడమని గుర్తు చేశారు. జూన్ 6వరకు ఎన్నికల కోడ్ ఉన్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం చాజముద్రపై నిర్ణయం తీసుకోవడం ఏంటని ప్రశ్నించారు. ఎన్నికల కమిషన్ చొరవ తీసుకొని దీన్ని నిలిపివేయాలని సూచించారు. లేదంటే రేపు ప్రజలు, సామాజిక ఉద్యమకారులు చేసే ధర్నాలకు అనుమతి ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కుసుమ సతీష్ బాబు, రత్నం సతీష్ షా, జిల్లా నాయకులు రాణా ప్రతాప్ రెడ్డి పాల్గొన్నారు.

## అది పరిపాలనకు ప్రతిరూపం..

**– పిన్నింటి విజయ్ కుమార్, బీఆర్ఎస్వీ నేత**



రాష్ట్ర చిహ్నం నుంచి కాకతీయ కళాతోరణం తొలగిస్తే విద్యార్థులుగా మా పెన్నులతో మీ ప్రభుత్వ పతనాన్ని రాస్తామని కేయూ బీఆర్ఎస్వీ నేత పిన్నింటి విజయ్ కుమార్ హెచ్చరించారు. రేవంత్ రెడ్డి తన మనవడికి కాకతీయ రాజయినటువంటి రుద్రదేవుడి పేరు పెట్టుకొని వారి చరిత్రకు చిహ్నంగా నిలిచన కళాతోరణాన్ని రాజముద్ర నుంచి తొలగించాలని నిర్ణయించడం సిగ్గుచేటన్నారు. ఈ మేరకు గురువారం హనుమకొండలోని హరిత కాకతీయ హోటల్ లో కాకతీయుల చరిత్రపై పరిశోధన చేస్తున్న యువ చరిత్రకారుడు అరవింద్ పకిడే, టార్చ్ సంస్థ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా కేయూ విశ్రాంత చరిత్ర విభాగాధిపతి ఆచార్య విజయ్ బాబు, తొలి ప్రేరిని నృత్య బ్యాచ్ ప్రదర్శకుడు అశోక్ కుమార్ పాల్గొని ప్రభుత్వ దుందుడుకు విధానాన్ని ఎండగట్టారు.

## ఏ గుర్తు తొలగించొద్దు..

**– అస్నాల శ్రీనివాస్, దొడ్డి కొమురయ్య ఫౌండేషన్**



ఉనికిలో ఉన్న రాజముద్రలోని ఏ గుర్తునూ తొలగించవద్దని దొడ్డి కొమురయ్య ఫౌండేషన్ అధ్యక్షుడు అస్నాల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. రాజుకు ప్రజలే నిజమైన సంపద అని అభయ శాసనం వేయించిన గణపతి దేవ రాజు కాకతీయ రాజుల కీర్తి ప్రతిష్టలకు చిహ్నంగా కళా తోరణంను నిర్మించారన్నారు. ఈ తోరణం కాకతీయ సప్త సంతాన తాత్వికతకు ప్రతీకగా నిలుస్తోందన్నారు. ఎగుడు దిగుడు దక్కన్ పీఠభూమిలో నీటికి నడకను నేర్పి చెరువుల నిర్మాణం తద్వారా రైతు సుభిక్షం దీనితో సమస్త కళా సంస్కృతులు వికాసం చెందాయనే అర్థం ఇమిడి ఉందని గుర్తు చేశారు. ప్రజల జీవన విధానం, సామాజిక బంధాలను నింపుకున్నదే కళాతోరణం అన్నారు. అందులో ప్రజల ఆత్మ ఉందన్నారు.

## చరిత్రపై కాంగ్రెస్ కుట్ర..

**దాస్యం వినయ్ భాస్కర్, ప్రభుత్వ మాజీ చీఫ్ విప్**




తెలంగాణ చరిత్రను వక్రీకరించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న కుట్రలను తిప్పి కొట్టాలని ప్రభుత్వ మాజీ చీఫ్ విప్, బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ పిలుపునిచ్చారు. గురువారం హనుమకొండలోని హరిత హోటల్ లో మేధావులతో ఆయన చర్చలు జరిపిన అనంతరం విలేఖరుల సమావేశంలో మాట్లాడారు. ఇది కాంగ్రెస్ నిర్ణయంగా భావించడం లేదన్నారు. తెలంగాణ ఉద్యమంలో పాలు పంచుకోని వ్యక్తి.. చరిత్రపై అవగాహన లేని వ్యక్తి చరిత్రను చెరిపివేయాలని చూస్తున్నాడని మండిపడ్డారు. ఈ దుశ్చర్య తప్పు అని చెప్పే ప్రయత్నం చేస్తున్నామన్నారు. ఓరుగల్ల చరిత్ర గుర్తులను తొలగిస్తుంటే జిల్లా మంత్రులు వ్యతిరేకించపోవడం సిగ్గు చేటన్నారు. టెంపుల్స్, ట్యాంక్స్, టౌన్స్ విధానంతో కాకతీయుల పాలన అందించారన్నారు. ఈ లోగో ఉంటే కేసీఆర్ ప్రజల మదిలో ఉంటారని, లోగో తీసేస్తే కేసీఆర్ ను ప్రజలకు దూరం చేయవచ్చనే దురుద్దేశంతోనే రాజముద్ర మార్చేందుకు కుట్రలు చేస్తున్నారన్నారు. కేబినెట్ లో నిర్ణయం తీసుకున్నప్పుడు మేమంతా వ్యతిరేకించాం .. రేవంత్ రెడ్డి చరిత్రకారులతో చర్చిస్తాం..సబ్ కమిటీ వేసి నిర్ణయం తీసుకుంటామని చెప్పి నేడు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. కాకతీయ కళా తోరణాన్ని అధికారిక చిహ్నం నుంచి తొలగిస్తే మరోసారి దశల వారీగా ఉద్యమం చేస్తామని, జిల్లా మంత్రులకు అడుగడుగునా నిరసన తెలియజేస్తామని హెచ్చరించారు. నిజమైన కాంగ్రెస్ వాదులు, ప్రజలు రేవంత్ రెడ్డి తుగ్లక్ పాలనను తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. నిరసనల్లో భాగంగా శుక్రవారం ఉదయం 11 గంటలకు కాళోజీ సెంటర్ లో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం చేపట్టనున్నట్లు వినయ్ భాస్కర్ ప్రకటించారు.

# ఆర్ట్స్ కాళేజీ మైదానంలో క్రికెట్ పోటీలు : ప్రకటించిన ప్రెస్ క్లబ్ బాధ్యులు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ సభ్యులకోసం నిర్వహించతలపెట్టిన క్రీడా పోటీల ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయని వరంగల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు ప్రకటించారు. అందులో భాగంగా క్రికెట్ పోటీలు నిర్వహించేందుకోసం నగరంలో అందుబాటులో ఉన్న పలు క్రీడా మైదానాలపై చర్చించిన క్లబ్ కార్యవర్గం, పలువురి సూచనలను పరిగణనలోకి తీసుకుని 'ఆర్ట్స్ కళాశాల గ్రౌండ్' అనువుగా ఉంటుందని ఒక నిర్ణయానికి వచ్చామన్నారు. దీంతో ఆర్ట్స్ కాలేజ్ మైదానంలో నాలుగు రోజులపాటు క్రికెట్ పోటీలు నిర్వహంచుకునేందుకు అనుమతివ్వాలంటూ గురువారం కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్.జ్యోతిని కలిసి విన్నవించుకున్నట్లు ప్రకటించారు. యూనివర్సిటీ నిబంధనల మేరకు ఫీజు చెల్లించాలని ప్రిన్సిపాల్ వివరించగా, జర్నలిస్టుల విషయంలో అందుకు మినహాయింపునివ్వాలని క్లబ్ బాధ్యులు కోరగా సాధ్యాసాధ్యాలను చర్చించిన అనంతరం ప్రత్యేక రాయితీతో ఫీజు చెల్లించి క్రికెట్ పోటీలు నిర్వహించుకోవటానికి క్లబ్ కార్యవర్గానికి ప్రిన్సిపాల్ అనుమతించినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ జ్యోతికి గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ సభ్యుల తరపున పుష్పగుచ్ఛం అందించి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి బొల్లారపు సదయ్య, కోశాధికారి బొల్ల అమర్, ఉపాధ్యక్షుడు గోకారపు శ్యాం తదితరులు పాల్గొన్నారు.

## వీఎల్ఈలకు అవగాహన సదస్సు



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** జిల్లా సమీకృత కార్యాలయం మీటింగ్ హాల్ లో నిర్వహించిన పల్లె సమగ్ర సేవ కేంద్రం (మీసేవ) వీఎల్ ఈ లకు మీ సేవ అప్లికేషన్ లు చేసేటప్పుడు ఎదురయ్యే సాంకేతిక సమస్యలు, ఇతర సర్వీలపైన అధికారులు అవగాహన కల్పించారు. మహబూబాబాద్ జిల్లాలో ముప్పై ఏడు గ్రామాలకు చెందిన మహిళా వీఎల్ఈలు మీటింగ్ లో పాల్గొన్నారు. మీటింగ్ లో తమ సమస్యలను అధికారులకు వివరించారు. వారి అమూల్యమైన సలహాలను, సందేహాలను జిల్లా సాంకేతిక అధికారులు స్వీకరించారు. ఈ కార్యక్రమానికి ఈ-డిస్ట్రిక్ట్ మేనేజర్(మీసేవ) ప్రశాంత్, శ్రీనిధి రిజినల్ మేనేజర్ మధు తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ కూలీలకు మజ్జిగ పంపిణీ



**వరంగల్ వాయిస్, మల్హర్ :** రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు జన్మదినం సందర్భంగా గురువారం మండలంలోని వల్లెంకుంట, కొయ్యూర్, పీవీ నగర్ గ్రామాల ఉపాధి హామీ కూలీలకు కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఐత రాజిరెడ్డి మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్టీ సెల్ ప్రధాన కార్యదర్శి లాకవత్ సవెందర్, వెన్నపు రెడ్డి శ్రీనివాస్, మండల మహిళా అధ్యక్షురాలు కొండ రాజమ్మ, కొండూరి మమత, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

## వల్లెంకుంటలో నేత్ర దానం



**వరంగల్ వాయిస్, మల్హర్ :** వల్లెంకుంట గ్రామానికి చెందిన వేముల జగ్గారావు అనారోగ్యంతో బుధవారం మృతి చెందగా, ఆయన చివరి కోరిక మేరకు మృతుడి కుటుంబ సభ్యులు అతని నేత్రాలను గోదావరిఖని పట్టణంలోని సదాశివ ఫౌండేషన్ ద్వారా హైద్రాబాద్ లోని ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రికి పంపించారు. నేత్ర దాన నిర్ణయం తీసుకున్న మృతుడు జగ్గారావుతో పాటు అతడి కుటుంబ సభ్యులను మండలంలోని పలువురు అభినందించారు.

## విత్తన కొనుగోళ్లపై రైతులకు అవగాహన



**వరంగల్ వాయిస్, మల్హర్ :** మరి కొన్ని రోజుల్లో వర్షాకాల సీజన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో మండలంలోని పలు గ్రామాల రైతులకు మండల వ్యవసాయ అధికారి సుధాకర్ ఆధ్వర్యంలో ఏఈవోలు విత్తన కొనుగోలు అంశంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. రైతులు వ్యవసాయ శాఖ ద్వారా గుర్తింపు పొందిన డీలర్ల వద్ద మాత్రమే రైతులు విత్తనాలు కొనుగోలు చేయాలని, విత్తన ప్యాకెట్, రశీదు పంట కాలం పూర్తి అయ్యే వరకు భద్రపరచుకోవాలని, లూజు గా ఉన్న విత్తన ప్యాకెట్లు ఎట్టి పరిస్థితుల్లో కొనుగోలు చేయకూడదని ఈ సందర్భంగా వారు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈవోలు అనూష, శిరీష, మనీషా, రైతులు పాల్గొన్నారు.

# గో అక్రమ రవాణాపై కఠిన చర్యలు తీసుకోవాలి

### భజరంగ్ దళ్ సురక్ష ప్రముఖ్ ఆదిత్య సాయి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** గోవధ నిషేధ చట్టాన్ని, రాష్ట్రవ్యాప్తంగా కచ్చితంగా అమలు చేయాలని విశ్వహిందూ పరిషత్ గోరక్ష రాష్ట్ర శాఖ పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా పోలీస్ స్టేషన్ లో, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారులకు వినతి పత్రం అందేశారు. సుబేదారి పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్ పి.సత్యనారాయణ రెడ్డి, హనుమకొండ పోలీస్ స్టేషన్ ఎస్ఐ, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ బి.రమ్యకు విశ్వహిందూ పరిషత్ గోరక్ష విభాగం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గోవులను కాపాడాలి, గోవధ నియంత్రించాలి, లారీలు, డీసీఎంలలో, క్లోజ్డ్ కంటైనర్స్ ద్వారా జరిగే గోవుల అక్రమ రవాణాపై తగిన చర్యలు తీసుకోవాలని, చెక్ పోస్ట్ లు ఏర్పాటు చేయాలని భజరంగ్ దళ్ సురక్షా ప్రముఖ్ కొల్లూరి ఆదిత్య సాయి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు గురువారం ఉదయం ఒక విజ్ఞాపన పత్రాన్ని వారికి అందజేశారు. ఇటీవల కాలంగా జిల్లాలో గోవుల అక్రమ రవాణా ఎక్కువగా జరుగుతుందని, గోవధ నిషేధ చట్టమున్నా అక్రమ రవాణా దారులు



ఏమాత్రం భయపడకుండా ఆవులను, గేదెలను అక్రమంగా రవాణా చేస్తూ దారుణంగా, కిరాతకంగా వధిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాల్సిందిగా డిమాండ్ చేశారు. సకల దేవతల స్వరూపం "గోమాత" వేద కాలం నుంచి గోవును ఆరాధ్య దేవతగా భావిస్తున్నాము. మెజారిటీ ప్రజలైన హిందువుల మనోభావాలను దెబ్బతీసే విధంగా వరంగల్ మహా నగరంలో పలుచోట్ల మాంసం వ్యాపారులు మరికొందరు ఆవులను, లేగదూడలను వధించి బహిరంగ ప్రదేశాలలో రోడ్ల పక్కకు, హిందూ జనసంచార ప్రదేశాలలో 35 స్థలాలలో నగరం నడిబొడ్డున విక్రయించుచున్నారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గోరక్ష ప్రముఖ్ నంగునూరు నాగరాజు, నల్లెల వెంకటేశ్వర్లు, దుర్గా వాహిని విభాగ్ సంయోజిక సంతోషం నాగమణి, సాహసంయోజిక చిగుమల్ల మౌనిక, ధర్మాచార్య ప్రముఖ్ గూడూరు రాకేష్, భజరంగ్ దళ్ సంయోజక్ బొజ్జం సిద్దు తేజ, భవాని నగర్ ప్రకండ అధ్యక్షుడు శ్రీపతి శ్రీకాంత్ గౌడ్, మఠ మందిర్ ప్రముఖ్ అనుమాండ్ల శివ కృష్ణ, భజరంగ్ దళ్ న్యూ శాయంపేట సంయోజక్ పొనుగంటి ప్రవీణ్, బైరిశెట్టి రాజేష్, శ్రీరామ్, రోహిత్ తదితర కార్యకర్తలు పాల్గొన్నారు.

## మానవత్వం చాటుకున్న దుకాణ యజమాని

### పోగొట్టుకున్న డబ్బులను బాధితుడికి అందజేత



**వరంగల్ వాయిస్, ములుగు :** నిజాయితీ నువ్వెక్కడ అంటే నేను ఎప్పుడో సచ్చిపోయాను నేను అనే పరిస్థితులు నేడు.. ఈ రోజుల్లో ప్రక్కన ఉన్నోన్ని ఎప్పుడు ముంచుదామని చూసే స్వార్థపరులే ఎక్కువగా ఉండే ఈ సమాజంలో మానవత్వానికి నిలువెత్తు రూపంగా నిలిచాడు ఆడెపు శ్రీనివాస్. వివరాలలోకి వెళితే ములుగు మండలం పందుకుంట (భూపాల్ నగర్)కు చెందిన పత్తిపాక సాంబయ్య అనే సింగరేణి ఉద్యోగి ములుగులోని ఎస్ బీఐ బ్యాంక్ లో రూ.3,50,000 తీసుకొని ములుగు జిల్లా కేంద్రంలోని మహాలక్ష్మి కిరాణం వద్దకు వెళ్ళి సరుకులు తీసుకొని డబ్బుల కవరును అక్కడే మరిచి వెళ్ళిపోయాడు. అక్కడ ఉన్న కవరును కిరణా షాప్ యజమాని అడెపు శ్రీనివాస్ తీసి చూడగా అందులో డబ్బులు ఉన్నాయి. కొంత సమయం తర్వాత బాధితుడి వచ్చి అడుగగా అతడి వివరాలు అడిగి అందులో ఎంత ఉందో తెలుసుకొని అతడికి డబ్బులను అందించి శ్రీనివాస్ తన మానవత్వాన్ని చాటుకున్నారు. అందుకు గాను, బాధితుడు శ్రీనివాస్ కు కృతజ్ఞతలు చెప్పారు. ఈ విషయం చుట్టు ప్రక్కల వారికి తెలియడంతో శ్రీనివాస్ మంచితనాన్ని పలువురు ప్రశంసించారు.

## లోగో మార్పు నిర్ణయం వెనక్కి తీసుకోవాలి

### నల్ల బ్యాడ్జీలతో బీఆర్ఎస్ శ్రేణుల నిరసన




**వరంగల్ వాయిస్, బాలసముద్రం :** తెలంగాణ లోగో మార్పును కాంగ్రెస్ ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని బీఆర్ఎస్ పార్టీ వరంగల్ పశ్చిమ కోఆర్డినేటర్ పులి రజినీకాంత్ అన్నారు. హనుమకొండ బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో గురువారం నల్ల బ్యాడ్జిలతో నిరసన తెలిపారు. కాకతీయ తోరణం, చార్మినార్ తెలంగాణ కీర్తి ప్రతిష్టలు ఇముడింప చేసేలా ఉన్న గుర్తులను తొలగించాలని కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రలు చేస్తున్నదని ఆరోపించారు. ప్రజల అభీష్టం మేరకు పాలన కొనసాగించాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం లోగో మార్పు నిర్ణయం వెనక్కి తీసుకొని పక్షంలో పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ జిల్లా అధ్యక్షుడు నయిమోద్దీన్, చాగంటి రమేష్, బొల్లు రవి, ఎండీ మహమూద్, సంపత్, ఇస్మాయిల్, సందీప్, రాజేశ్వర్, అఫ్జల్ పాల్గొన్నారు.

# కార్మిక వర్గం హక్కులను కాపాడేదే సీఐటీయూ

### జిల్లా కార్యదర్శి ముక్కెర రామస్వామి




**వరంగల్ వాయిస్, వరంగల్ :** సీఐటీయూ 54 ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కరీమాబాదు ఏరియా కమిటీ ఆధ్వర్యంలో నూతన జెండాను సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముక్కెర రామస్వామి ముఖ్య అతిథిగా పాల్గొని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన పాల్గొని మాట్లాడుతూ సీఐటీయూ ఆవిర్భవించి నేటికి 54 సంవత్సరాలు అవుతుందన్నారు. ఐక్యత పోరాటం అనే నినాదాన్ని ఐదు దశాబ్దాల నుంచి ఆచరణలో పెట్టడానికి తీవ్రమైన ప్రయత్నాలు జరిగాయని తెలిపారు. ముఖ్యమైన నినాదాన్ని ఆచరణలో అమలు చేసేందుకు అవిశ్రాంతంగా సీఐటీయూ నిరంతరం పోరాటం కొనసాగిస్తుందన్నారు. దేశంలోనే ట్రేడ్ యూనియన్ ఉద్యమం ప్రారంభంలో సీఐటీయూ ఒంటరి అయినప్పటికీ ప్రయత్నాలు అధిగమించడమే కాకుండా నేడు కార్మిక వర్గానికి కాపాడడం, ఐక్య ఉద్యమాలను అభివృద్ధి చేయడంలో, కార్మిక వర్గం హక్కులు, వేతనాలు, ప్రయోజనాలను, పని పరిస్థితులను మెరుగుపరచడంలో ఛాంపియన్ గా సీఐటీయూ ముందు నిలిచి గుర్తింపు పొందిందన్నారు. 1970 అక్టోబర్ లో ఆవిర్భవించిన సీఐటీయూ అన్ని రకాల దోపిడీ వర్గాల నుంచి సమాజాన్ని విముక్తి చేయడానికి అండగా నిలుస్తుంది. ఉత్పత్తి, పంపిణీ, వినిమయానికి సంబంధించిన అన్నింటిని సమాజంపరం చేయడం ద్వారా సోషలిస్టు రాజ్యాన్ని స్థాపించడం ద్వారానే కార్మిక వర్గం దోపిడీ అంతం చేయవచ్చని సీఐటీయూ నమ్ముతుందన్నారు. కేంద్రంలోని మోడీ నేతృత్వంలో బీజేపీ ప్రభుత్వం తన పదేళ్ల పదవీ కాలంలో నయా ఉదారవాద విధానాలను దూకుడుగా అనుసరిస్తూ ఆర్ఎస్ఎస్ హిందుత్వ మత విభజన ఎజెండాను ప్రోత్సహించిదని మండిపడ్డారు. బీజేపీ ప్రభుత్వం మతోన్మాద విధానాలకు వ్యతిరేకంగా రాబోయే రోజులలో పెద్ద ఎత్తున కార్మిక హక్కులను కాపాడేందుకు సీఐటీయూ ముందుంటుందని తెలిపారు. కార్మిక వర్గం అంతా తమ హక్కులను కాపాడేందుకు ఎర్రజెండా కింద ఉండి పోరాటాలు ఉధృతం చేయాలని ఈ సందర్భంగా ముక్కెర రామస్వామి కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గున్నాల ప్రభాకర్, ఎండీ సాజియా, మద్దూరి రవీందర్, మహబూబ్, మార్గం కిరణ్, గోపాల్, సదానందం, మల్లేశం, మురళి, రాజ్ కుమార్, ఎండీ ఇస్మాయిల్, లక్ష్మి, జుబేదా, భాగ్య, యాదగిరి, కాజా తదితరులు పాల్గొన్నారు.

# కమ్యూనిస్టులే దేశానికి ప్రత్యామ్నాయం

## సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు తక్కళ్లపల్లి



**వరంగల్ వాయిస్, జఫర్ గడ్ :** కమ్యూనిస్టులే దేశానికి సరైన ప్రత్యామ్నాయం అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు తక్కళ్లపల్లి శ్రీనివాస రావు అన్నారు. గురువారం జఫర్ గడ్ మండల కేంద్రంలో జనగామ జిల్లా పార్టీ రాజకీయ శిక్షణా తరగతులు ప్రారంభమయ్యాయి. రెండు రోజుల పాటు జరగనున్న ఈ శిక్షణా తరగతులలో సీపీఐ జిల్లా సమితి సభ్యులు, మండల కార్యదర్శులు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన శిక్షణా తరగతుల ప్రారంభ సమావేశానికి సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఆది సాయన్న అధ్యక్షత వహించగా తక్కళ్లపల్లి శ్రీనివాస రావు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. దేశంలో ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో వామపక్షాల బలోపేతం కావాల్సిన అవసరం ఉందన్నారు. కులం, మతం పేరుతో రాజకీయ లబ్ధి పొందాలని చూసే పార్టీలకు కాలం చెల్లిందన్నారు. లౌకిక దేశమైన భారత దేశంలో మత రాజకీయాలు, మతోన్మాద శక్తులు అంతరించిపోక తప్పదని అన్నారు. కేంద్రంలో పదేళ్ల పాటు అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు మేలు చేకూర్చేందుకే పని చేసిందని, పేదలు, మధ్య తరగతి వర్గాల ప్రజల సమస్యలను పట్టించుకోలేదన్నారు. దళితుల, గిరిజనుల, మైనారిటీలపై బీజేపీ హయాంలో దాడులు పెరిగాయని, చివరకు రాజ్యాంగం, ప్రజాస్వామ్య వ్యవస్థలను కూడా ధ్వంసం చేసే ప్రయత్నం చేశారన్నారు. కమ్యూనిస్టులు, లౌకిక శక్తులతోనే ప్రజాస్వామ్య, రాజ్యాంగ రక్షణ సాధ్యం, గడిచిన లోక్ సభ ఎన్నికలలో దేశ ప్రజలు బీజేపీకి సరైన గుణపాఠం చెప్పబోతున్నారని అన్నారు. రానున్న రోజులలో పార్టీ బలోపేతానికి సీపీఐ, ప్రజాసంఘాల నాయకులు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జనగాం జిల్లా కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే సీహెచ్ రాజారెడ్డి, డాక్టర్ మార్క శంకర్ నారాయణ, పాతూరి సుగుణమ్మ, ఆకుల శ్రీనివాస్, మంగళంపల్లి జనార్ధన్, మండల కార్యదర్శి జువారి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## కనుల పండుగగా హనుమాన్ శోభాయాత్ర

### హనుమాన్ నామస్మరణతో మార్మోగిన తిమ్మాపూర్



**వరంగల్ వాయిస్, ఎల్కతుర్తి :** మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో హనుమాన్ శోభాయాత్ర కనుల పండుగగా నిర్వహించారు. ముందుగా హనుమాన్ స్వాములు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించిన ట్రాక్టర్ లో హనుమాన్ చిత్రపటాన్ని ఉంచి హనుమాన్ నామస్మరణ చేస్తూ డీజే చప్పులతో గ్రామంలో కలియ తిరిగారు. ఈ సందర్భంగా హనుమాన్ భక్తులు మాట్లాడుతూ ఎప్పుడూ లేని విధంగా తిమ్మాపూర్ గ్రామంలో హనుమాన్ శోభాయాత్రను పెద్ద ఎత్తున నిర్వహించి నూతన ఒరవడికి శ్రీకారం చుట్టారని ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ విధంగానే ప్రతి సంవత్సరం గ్రామంలో హనుమాన్ శోభాయాత్ర నిర్వహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో హనుమాన్ స్వాములు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## ఫెర్టిలైజర్ షాపుల్లో విస్తృత తనిఖీలు



**వరంగల్ వాయిస్, మల్హర్ :** మండలంలోని కొయ్యూరు గ్రామ పంచాయతీ పరిధిలోని ఫెర్టిలైజర్ షాప్ లలో మండల వ్యవసాయ అధికారి సుధాకర్, కొయ్యూరు ఎస్సై నరేష్ తనఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మరో వారం రోజుల్లో వర్షాకాల సీజన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో ఫెర్టిలైజర్ షాప్ ల యజమానులు రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు మాత్రమే విక్రయించాలని, నకిలీ విత్తనాలు అమ్మి రైతులను మోసం చేస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు ఉంటాయని తెలిపారు. విత్తనాలను బ్లాక్ మార్కెట్ కు తరలిస్తే షాప్ లైసెన్సు రద్దు చేసి క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని ఈ సందర్భంగా వారు హెచ్చరించారు.

## కాచినపల్లి అమరవీరుల ఆశయాలను కొనసాగిద్దాం



**వరంగల్ వాయిస్, నర్సంపేట :** బూటకపు ఎన్ కౌంటర్ లో హత్య చేయబడ్డ కాచినపల్లి అమరవీరుల సంస్మరణ సభ గురువారం నర్సంపేట పట్టణంలో సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీ ఆధ్వర్యంలో నర్సంపేట డివిజన్ కార్యదర్శి ఎలకంటి రాజేందర్ అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న న్యూ డెమోక్రసీ ప్రజాసంఘాల నాయకులు కార్యకర్తలు ముందుగా కాచినపల్లి అమరవీరుల చిత్రపటానికి పూలమాలవేసి రెండు నిమిషాలు మౌనం పాటించి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభలో ఐ ఎఫ్ టి యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం శ్రీనివాస్ పార్టీ జిల్లా నాయకులు బండి కోటేశ్వరరావు రాచర్ల బాలరాజు గంగుల దయాకర్, సూర్యంలు మాట్లాడారు. 1991 మే 29వ తేదీన పార్టీ దళ నాయకులు కామ్రేడ్ కోటన్న విప్లవ ప్రజా సంఘాల నాయకులు కామ్రేడ్ సుసేన చింతా లక్ష్మి, నంబూరి సీతారామయ్య, పరశు రాములును నాటి, కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఎన్ కౌంటర్ పేరా కాల్చి చంపిందన్నారు. పీడిత ప్రజల సమస్యలు పరిష్కరించలేని దోపిడి ప్రభుత్వాలు ప్రజల కోసం పోరాడుతున్న విప్లకారులను చంపడమే పనిగా పెట్టుకున్నాయని మండిపడ్డారు. నేడు దేశవ్యాప్తంగా నరమేధం సాగుతున్నదని వారు విమర్శించారు. కాచినపల్లి అమరవీరులు చూపిన మార్గంలో నూతన ప్రజాస్వామ్య విప్లవం సాధించడం కోసం విప్లవకారులు ఐక్యం కావల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ ప్రజా సంఘాల నాయకులు గట్టి కృష్ణ, జక్కుల తిరుపతి, భోగి సారంగపాణి, పూలక్క, బన్న నర్సింగం, హరిబాబు, వీరన్న, కృష్ణ, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

## టైలరింగ్ సెంటర్ ప్రారంభం



**వరంగల్ వాయిస్, రాంపూర్ :** నగరంలోని 46వ డివిజన్ పరిధిలోని రాంపూర్ లోని గ్రామంలో టైలరింగ్ సెంటర్ ను సిరి స్వచ్ఛంధ సంస్థ అధ్యక్షుడు డా.పరికి సుధాకర్ గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా 46వ డివిజన్ కార్పొరేటర్ సరోజన హాజరై ఆమె చేతుల మీదుగా సెంటర్ ప్రారంభించడం జరిగింది. దీనికి గౌరవాధ్యక్షురాలిగా కుసుమ కవిత, సామాజికవేత్త నిమ్మల శ్రీనివాస్, ప్రతినిధులు డాక్టర్ కుమార్ స్వామి, సౌందర్య, విజయలక్ష్మి, కవిత, తిరుమల, రాధిక గ్రామంలోని పెద్దలు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## స్వయంకృషి వృద్ధాశ్రమంలో ఉచిత ఆరోగ్య శిబిరం



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ మొబైల్ మెడికేర్ యూనిట్, హనుమకొండ శాఖ ఆధ్వర్యంలో గురువారం ములుగు రోడ్ దగ్గర ఉన్న స్వయంకృషి వృద్ధాశ్రమంలో వృద్దులకు సంచార వాహన వైద్య సేవల ఉచిత ఆరోగ్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ ఆరోగ్య శిబిరాన్ని రెడ్ క్రాస్ రాష్ట్ర పాలకవర్గ సభ్యుడు ఈవీ శ్రీనివాస్ రావు, జిల్లా పాలకవర్గ సభ్యుడు బిల్లా రమణారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 60 సంవత్సరాలు పైబడిన వయో వృద్ధులకు హనుమకొండ రెడ్ క్రాస్ సంచార వైద్యశాల సేవలు ద్వారా బీపీ, షుగర్ రక్త పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించటం జరిగిందని తెలిపారు. ఈ ఆరోగ్య శిబిరంలో రెడ్ క్రాస్ డాక్టర్లు డా.జె.కిషన్ రావు, డా.టి.మదన్ మోహన్ రావు, బాబు రావు, సాంబయ్య, స్వయంకృషి ప్రెసిడెంట్ శుభ, భాగ్యమ్మ, అనిత, సుగుణ రాధా, అనూష, ప్రవిత, రమ, రెడ్ క్రాస్ సిబ్బంది గుల్లెపెల్లి శివకుమార్, సాగర్, అనిల్, కె.రమేష్, రాజు వృద్దులు పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



**వరంగల్ వాయిస్, మల్హర్ :** మండల కేంద్రమైన తాడిచర్ల గ్రామంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో 1992-93 సంవత్సరంలో పదవ తరగతి చదివిన విద్యార్థిని, విద్యార్థులు దాదాపు 31 సంవత్సరాల తర్వాత కలిసి గెట్ టు గెదర్ ప్రోగ్రాం నిర్వహించారు. గురువారం తాడి చర్లలోని హై స్కూల్ లో కలుసుకొని చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా వారికీ విద్య చెప్పిన గురువులకు సన్మానం చేశారు. ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి కృషి చేసిన ధనంజనేయులు, గోపాల్, రవీందర్, గౌస్ పాషా, మొగిలి, సతీష్, ప్రవీణ్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## ఎల్‌బీ కాలేజీ క్యాడెట్లకు వంద శాతం ఎన్సీసీ 'బీ' సర్టిఫికెట్లు



**వరంగల్ వాయిస్, వరంగల్ :** స్థానిక ఎల్ బీ కళాశాల ఎన్సీసీ ఆర్మీ పదో తెలంగాణ బెటాలియన్ నుంచి 100 శాతం ఎన్సీసీ 'బీ' సర్టిఫికెట్ పాస్ అయినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ అరుణ డీహెచ్ రావు తెలిపారు. వరంగల్ గ్రూప్ అండ్ సీసీలో 100 శాతం ఫలితాలు సాధించిన ఎన్సీసీ విభాగాన్ని గురువారం వారు అభినందించారు. ఈ ఎన్సీసీ బి సర్టిఫికెట్ విద్యార్థులకు ఎంతో విలువైనదని, భవిష్యత్తులో ఉన్నత ఉద్యోగ అవకాశాల్లో, ఉన్నత విద్యలో ప్రత్యేక రిజర్వేషన్ ద్వారా లబ్ధి పొందుతారని, ఆర్మీలో నేరుగా ప్రవేశించడానికి ఈ సర్టిఫికెట్ ఎంతో దోహదపడుతుందని ప్రిన్సిపాల్ తెలిపారు. మంచి ప్రతిభ కనబరిచి కళాశాలకు 100 శాతం ఫలితాలు సాధించిన ప్రతీ ఎన్సీసీ క్యాడెట్ ను ప్రిన్సిపాల్ తన కార్యాలయంలో అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎన్సీసీ ఆర్మీ విభాగం ఆఫీసర్ కెప్టెన్ డాక్టర్ ఎం.సదానందం, సీనియర్ అండ్ ఆఫీసర్ బాల జోహార్, రాజ్ కుమార్, సంతోషి జూనియర్ అండ్ ఆఫీసర్, సృజన, కళ్యాణ్, శృతి, వర్ష, బి సర్టిఫికెట్ పాస్ అయిన క్యాండిడేట్స్ పాల్గొన్నారు.

# మాతా, శిశు మరణాలు జరగకుండా చూడాలి

## డీఎంహెచ్ఓ డాక్టర్ అల్లెం అప్పయ్య



**వరంగల్ వాయిస్, ములుగు :** జిల్లాలో మాత శిశు మరణాలు జరగకుండా చూడాలని ములుగు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ అల్లం అప్పయ్య అన్నారు. ములుగు జిల్లాలోని వెంకటాపూర్ మండల కేంద్రంలో గల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం ఆయన సందర్శించారు. ఆసుపత్రిలో ప్రతి మంగళ, గురు వారాలలో నిర్వహిస్తున్న ఆరోగ్య మహిళ కార్యక్రమం వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. వైద్యులు అందిస్తున్న సేవలు రోగుల ద్వారా ఆరా తీశారు. అనంతరం వైద్యులు సూపర్వైజర్లు సిబ్బందితో కలిసి సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కమిషనర్ ఆఫ్ ఫ్యామిలీ వెల్ఫేర్ ఆదేశాల మేరకు కొత్తగా జనవరి 2024 నుంచి నూతనంగా నిర్వహిస్తున్న బాలింతల ఆరోగ్య సంరక్షణ, శిశు ఆరోగ్య సంరక్షణ కార్యక్రమం ద్వారా మాతా శిశు మరణాలు రేటును తగ్గించాలని కమిషనర్ ఆదేశించినట్లు తెలిపారు. ప్రసవం అనంతరం తల్లి బిడ్డలను 45 రోజులు కనీసం 6 నుంచి 7 సార్లు సందర్శించి, ఎప్పటికప్పుడు ఆరోగ్య పరిస్థితులను తెలుసుకొని ఉన్నతాధికారులకు తెలియజేస్తూ స్టేట్ పోర్టల్ లో నమోదు చేయాలని ఆదేశించారు. ములుగు జిల్లాలో ఈ ఆర్థిక సంవత్సరంలో ఒక బాలింత మరణం సంభవించిందని, రాబోయే రోజుల్లో ఇలాంటి మరణాలు జరగకుండా వైద్యులు, సిబ్బంది ప్రత్యేక చొరవ తీసుకొని ప్రజలకు అవగాహన చేయాలని సూచించారు. మండల కేంద్రంలోని ఇద్దరు బాలింతల ఇంటికి వెళ్లి తల్లి బిడ్డల ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. వాళ్లకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన సలహాలు సూచనలు చేసి మందులను అందజేశారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని కుటుంబ సభ్యులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట మాతా శిశు సంరక్షణ జిల్లా అధికారి డాక్టర్ చీర్ల శ్రీకాంత్, స్థానిక వైద్యాధికారులు డాక్టర్ రిషిత, డాక్టర్ భవ్య, హెల్త్ ఎడ్యుకేటర్ భాస్కర్, పీహెచ్ఎన్ఓ శోభ, ఏఎన్ఎంలు స్వప్న, కనకలక్ష్మి, ఆశా కార్యకర్తలు సరోజన, మాధవి, సౌజన్య, శోభ, కవిత, సంపూర్ణ, ఇందిర తదితరులు పాల్గొన్నారు.

# కుల గణనతోనే బీసీలకు సమగ్ర న్యాయం

## బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బైరి రవికృష్ణ గౌడ్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** శాస్త్రీయమైన కుల గణన చేయడం ద్వారానే భవిష్యత్తులో ఎలాంటి న్యాయపరమైన చిక్కులు లేకుండా ఉంటుందని, అప్పుడే బీసీలకు సమగ్ర న్యాయం జరుగుతుందని, దీనిపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే చొరవ చూపి వెంటనే కుల గణన చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాలని తెలంగాణ రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బైరి రవికృష్ణ గౌడ్ డిమాండ్ చేశారు. ఈ విషయాలపై బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ తో కలిసి మంత్రులకు, అధికారులకు, పార్టీ నేతలకు మెమోరాండం అందజేసినట్లు బైరి రవికృష్ణ గౌడ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికైనా కుల గణన విషయంలో కాంగ్రెస్ పార్టీ బీసీలకు ఇచ్చిన హామీని కచ్చితంగా నెరవేరుస్తదని నమ్ముతున్నామని, రాష్ట్రంలో సమగ్ర కుల గణన చేపట్టి బీసీ రిజర్వేషన్లు పెంచిన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలని, ఎన్నికల కోడ్ ముగియగానే రాష్ట్రంలో వెంటనే కులగణన చేపట్టే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డిని కోరారు.

# పొగాకు నుంచి భావి తరాలను రక్షించాలి

## డీఎంహెచ్ఓ డాక్టర్ కళావతి భాయి



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** పొగాకు పరిశ్రమ జోక్యం నుంచి పిల్లలను రక్షించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కళావతి బాయి అన్నారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం (డబ్ల్యూఎన్ టీడీ)ని ప్రతి సంవత్సరం మే 31న జరుపుకుంటామని, ప్రపంచ ఆరోగ్య సంస్థ ముఖ్య ఉద్దేశ్యం పొగాకు వాడకం వల్ల కలిగే ప్రమాదాల గురించి ప్రజలలో అవగాహన కల్పించడం, పొగాకు నియంత్రణ విధానం మార్పుల చేయడం, పొగాకు నియంత్రణను ప్రోత్సహించడం లక్ష్యంగా పెట్టుకొని ఆరోగ్యం, ఆరోగ్యకరమైన జీవనం, భవిష్యత్తు తరాలను రక్షించడానికి దోహదం చేయాలనే ఉద్దేశంతో ప్రపంచ ఆరోగ్య సంస్థ సభ్య దేశాలు 1987లో ప్రపంచ పొగాకు నిరోధక దినోత్సవాన్ని ఏర్పాటు చేశాయని పేర్కొన్నారు. ఒక దేశం పొగాకుకు సంబంధించిన ప్రస్తుత మరియు భవిష్యత్తు స్థితిని చర్చించడానికి కూడా ఈ రోజు ఒక ప్రత్యేకతగా ఉపయోగించబడుతుందని తెలిపారు. ఉదాహరణకు పొగాకు వినియోగంలో భారతదేశం 275 మిలియన్ల పొగాకు వినియోగదారులతో ప్రపంచంలో అత్యధిక స్థాయిలో ఉందని, దేశంలో విస్తృతంగా వ్యాపిస్తున్న వ్యసనాన్ని అరికట్టేందుకు భారత ప్రభుత్వం ధూమపాన విరమణ హెల్ప్‌లైన్‌ను కూడా ప్రారంభించిందని తెలిపారు. ఈ సంవత్సరం ప్రపంచ పొగాకు నిరోధక దినోత్సవం థీమ్ “పొగాకు పరిశ్రమ జోక్యం నుంచి పిల్లలను రక్షించడం”. అని తెలిపారు.పొగాకు ఉత్పత్తులను మానివేయాలనుకునే పొగాకు వినియోగదారులకు కౌన్సెలింగ్, హెల్ప్ లైన్‌లు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. అవగాహన పెంచడానికి, పొగాకు రహిత జీవనశైలిని ప్రోత్సహించడానికి పాఠశాలలు, కార్యాలయాలు, కమ్యూనిటీ సంస్థలతో కలిసి పని చేయాలని చెప్పారు. పొగాకు రహిత భవిష్యత్తును సృష్టించడంలో ప్రతి ఒక్కరిని భాగస్వామ్యులను చేయాలన్నారు.

# గుర్తింపు పొందిన డీలర్ల దగ్గరే విత్తనాలు కొనాలి

## జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి



**వరంగల వాయిస్, ములుగు :** వ్యవసాయ శాఖ గుర్తింపు పొందిన డీలర్ల దగ్గరే విత్తనాలు కొనుగోలు చేయాలని, జిల్లాలో నకిలీ విత్తనాలు నియంత్రణకు జిల్లా స్థాయిలో రెండు టాస్క్ ఫోర్స్ బృందాలను ఏర్పాటు చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వ్యవసాయ శాఖ గుర్తింపు పొందిన డీలర్ల దగ్గరే విత్తనాలు కొనుగోలు చేయాలని, విడిగా ఉన్న సంచుల్లోని విత్తనాలను కొనుగోలు చేయరాదని, సంబంధిత కంపెనీ లేబుల్ ఉన్న ప్యాకెట్లను కొనాలని తెలిపారు. కొనుగోలు చేసిన విత్తనాల ఖాళీ ప్యాకెట్లను, బిల్లులను పంటకాలం పూర్తయ్యే వరకు భద్రంగా ఉంచుకుంటే ఒకవేళ నకిలీ విత్తనాల కారణంగా దిగుబడి రానప్పుడు సంబంధిత డీలర్లపై చర్యలు తీసుకోవడానికి అవకాశం ఉంటుందన్నారు.

### వదంతులు నమ్మొద్దు..

కొంతమంది విత్తన కంపెనీలు, వ్యాపారం నిమిత్తం తప్పుడు ప్రచారం చేస్తున్నాయి. ఏ రకమైన పత్తి విత్తనాలైన దిగుబడి ఒకే రకంగా ఉంటుంది. సాగు పద్ధతులు భూమి లోపల ఉన్న బలం ఆధారంగా పంట దిగుబడి ఆధారపడి ఉంటుంది. రకాలను బట్టి కాదు. అన్ని రకాల పత్తి విత్తనాలు మంచివే. విత్తనాలు కొన్న వెంటనే ఇంటి లోపల భద్రపరుచుకోవాలి. ఎండవేడికి పెట్టరాదు. నకిలీ విత్తనాల నియంత్రణ కోసం సహాయ వ్యవసాయ సంచాలకులు ములుగు, ఏటూరు నాగారం, విత్తన ధ్రువీకరణ అధికారి పోలీసు అధికారులతో టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేశామని, వీరు 24 గంటల పాటు అందుబాటులో ఉంటారని, రైతులు ఎవరైనా బిజి-3, హెచ్.టి ప్రతి విత్తనాలు రాత్రి వేళల్లో గ్రామాల్లో తిరిగి అమ్మే విత్తనాలు గురించి సమాచారం తెలిస్తే టాస్క్ ఫోర్స్ అధికారులు, ములుగు సహాయ వ్యవసాయ సంచాలకుడు శ్రీపాల్ 7288894761, ఏటూరు నాగారం సహాయ వ్యవసాయ సంచాలకుడు శ్రీధర్ 7288894766 ఫోన్ నెంబర్ లకు సమాచారం అందించాలన్నారు. అధికారులకు సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడునని తెలిపారు. వ్యవసాయ శాఖ, టాస్క్ ఫోర్స్ యంత్రాంగం సహాయంతో వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. నకిలీ విత్తనాలు అరికట్టడంలో ఎవరైనా తమకు తెలిసిన సమాచారం ఉంటే అందించి రైతు సంక్షేమానికి తోడ్పడగలరని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించాలి

## ఏఐకేఎంఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి గౌని ఐలయ్య




**వరంగల్ వాయిస్ మహబూబాబాద్ :** రాష్ట్రంలో రైతులకు సకాలంలో నాణ్యమైన విత్తనాలను 75 శాతం సబ్సిడీతో ప్రభుత్వం అందించాలని, వచ్చే జూన్ లోపే రైతు రుణమాఫీ చేసి రైతాంగాన్ని ఆదుకోవాలని ఏఐకేఎంఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి గౌని ఐలయ్య డిమాండ్ చేశారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట అఖిల భారత రైతు కూలీ సంఘం ఏఐకేఎంఎస్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా గౌని ఐలయ్య మాట్లాడుతూ రైతాంగానికి నకిలీ బెడద లేకుండా ప్రైవేట్ ఫర్టిలైజర్లు అమ్మే విత్తనాలు కాకుండా ప్రభుత్వమే సబ్సిడీపై ఎరువులు విత్తనాలుచ పెస్టిసైడ్స్ రైతులకు అందించాలని డిమాండ్ చేశారు. అధికారంలోకి రాగానే రుణమాఫీ చేస్తానన్న ప్రభుత్వం నేటికీ అమలు చేయకపోవడం సిగ్గుచేటన్నారు. కాబట్టి, జూన్ లోపే రైతు రుణమాఫీ చేయాలని కోరారు. అలాగే సన్న వడ్లకే బోనస్ అని ప్రకటించిన ప్రభుత్వం దొడ్డు రకం ధాన్యానికి కూడా బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కల్లాలలో తడిసిన ధాన్యాన్ని సత్వరమే ప్రభుత్వం కొనుగోలు చేయాలని కోరారు. అలాగే కొత్త రుణాలను సీజన్ ప్రారంభంలో రైతులకు బ్యాంకుల ద్వారా అందించేందుకు పాటుపడాలని కోరారు. పంటలకు సమగ్ర పంట బీమాను కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి గుజ్జు దేవేందర్, ఉపాధ్యక్షులు మదశెట్టి నాగేశ్వరరావు, చారి హరీష్, కట్ల నాగరాజు, బాలమల్లు, బ్రహ్మాచారి, సోమయ్య, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# డ్రంకెన్ డ్రైవ్‌లో 11మందికి జరిమాన

**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** వరంగల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో లైసెన్స్ లేకుండా వాహనం నడిపి పట్టుబడ్డ ఒకరికి వరంగల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ గుర్రపు వీరస్వామి రూ.1500 జరిమాన విధించారు. డ్రంకెన్ డ్రైవ్ కేసులో 11మందికి రూ.7,500 జరిమాన విధించినట్లు వరంగల్ ట్రాఫిక్ కె. శ్రీధర్ తెలిపారు.

# కురుమ గొంగడికి యునెస్కో గుర్తింపు హర్షనీయం

## ఎంపీటీసీ సభ్యులు పేర్ని ఉషా రవి



**వరంగల్ వాయిస్, రఘునాథపల్లి :** తెలుగు రాష్ట్రాల్లో కురుమ సామాజిక వర్గానికి ప్రధాన వస్త్రముగా వస్తున్న గొంగడికి యునెస్కో గుర్తింపు ఉత్తర్వులు జారీ చేయడంతో గురువారం రఘునాథపల్లి ఎంపీటీసీ సభ్యులు, కురుమ యువజన చైతన్య సమితి రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి పేర్ని ఉషా రవి కురుమ” హర్షం తెలిపారు. గురువారం విలేకరులతో వారు మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో 47 విశిష్ట చేనేత సంప్రదాయ దుస్తులు ధరించి ఉంటుంది. చలికాలంలో వెచ్చగాను, ఎండాకాలంలో చల్లగాను, వర్షాకాలంలో మనిషిని తడవకుండా ఉండడం తదితర కారణాలతో గొంగడికి ప్రత్యేక స్థానాన్ని ఇచ్చినట్లు యూనిస్కో ప్రతినిధులు తెలిపినట్లు చెప్పారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారతదేశంలో గొల్ల కురుమలకు ప్రత్యేక గుర్తింపు రావడం అభినందనీయమని అన్నారు.

# ‘ప్రకృతి మిత్ర’ లోగో ఆవిష్కరణ



**వరంగల్ వాయిస్, వరంగల్ :** గొప్ప సామాజిక బాధ్యతతో పర్యావరణ పరిరక్షణకు పాటుపడుతున్న ఐఆర్ డీఏ స్వచ్ఛంధ సేవా సంస్థ కృషి గొప్పదని అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయశాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. ఐఆర్ డీఏ సంస్థ ప్రతినిధులు, విద్యార్థులతో కలిసి ‘ప్రకృతి మిత్ర’ లోగోను గురువారం హైదరాబాద్ లోని వారి నివాసంలో మంత్రి సురేఖ ఆవిష్కరించారు. గిన్నీస్ బుక్ రికార్డు లక్ష్యంగా గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 450 టన్నుల వేస్ట్ పేపర్ ను సేకరించి, రీసైకిల్ చేసి ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థినీ, విద్యార్థులకు నోట్ బుక్కులను అందించాలనే లక్ష్యంతో ఐఆర్ డీఏ చేస్తున్న కృషి స్ఫూర్తిదాయకమైనదని మంత్రి అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఈ సంస్థ ఆధ్వర్యంలో 5 జూన్ 2025 నాటికి లక్ష మొక్కలు నాటే కార్యక్రమంలో భాగస్వాములు కాబోతున్న ప్రతి ఒక్కరికి మంత్రి సురేఖ అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐఆర్డీఏ సంస్థ అధ్యక్షుడు పి.వినయ్ కుమార్, ఎం.సురేష్, మట్టా వికాస్, పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

# అంతా నా ఇష్టం..!




**రేగొండ పోస్టాఫీస్‌లో అతనిదే పెత్తనం**
**డబ్బులు ఇస్తేనే పనులు**
**ఎవడు చేయమన్నాడు ఉపాధి పని**
**ఇదీ రేగొండ ఎస్పీఎం రమేష్ తీరు**

**వరంగల్ వాయిస్, రేగొండ :** మండల తపాలా కార్యాలయంలో ఓ ఉన్నతాధికారి బరితెగించారు. ఉన్నత అధికారుల మాటలు ఖాతరు చేయకుండా లంచావతరం ఎత్తారు. డబ్బులు ఇస్తేనే పనులు చేస్తా అంటూ బేషరతుగా అడుగుతున్నారు. ఎవరికి చెప్పుకుంటారు చెప్పుకోండి అంటూ ఉపాధి కూలీలను బూతులు తిడుతూ పోస్ట్ అధికారి రమేష్ బెదిరింపులకు గురిచేస్తున్నారు. వివరాల్లోకి వెళితే రేగొండ మండల కేంద్రంలో ఆయా గ్రామ పంచాయతీలకు ఏకైక సబ్ పోస్టాఫీస్ ఉంది. అందులో ఎస్పీఎంగా రమేష్ అనే ఉద్యోగి పని చేస్తున్నారు. కాగా, మండలంలో 37 గ్రామ పంచాయతీల్లో ఉపాధి హామీ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. గత రెండు నెలలుగా పనులు చేస్తున్న కూలీలకు సరైన సమయానికి డబ్బులు రావడం లేదు. పనులు చేస్తున్నాం.. ఉపాధి డబ్బులు రావాలని గ్రామ కార్యదర్శి, ఫీల్డ్ అసిస్టెంట్లు అడుగగా మీ ఖాతాల్లోకి డబ్బులు జమ అవుతున్నాయి కానీ, తపాలా కార్యాలయంలో మైపింగ్ కారణం వల్ల మీ ఖాతాలో జమ కావడం లేదు. రేగొండ పోస్టాఫీస్‌లో అడగండని చెబుతున్నారు. కూలీలు తమ జాబ్ కార్డు, అకౌంట్ బుక్, ఆధార్ కార్డు తో పోస్టాఫీస్ వద్దకు వెళ్లి ఎస్పీఎం రమేష్‌ను మా ఖాతాలో డబ్బులు జమ కావడం లేదు జర చూడండి సారు అంటూ మర్యాదగా అడిగారు. దీంతో రమేష్ అనే ఉద్యోగికి ఒక్క సారిగా కూలీల పైకి విరుచుకు పడి ఎవరు చేయమన్నారు మిమ్మల్ని ఉపాధి పని... ఎవడు పంపించారు మా దగ్గరికి.. డబ్బులు లేవు ఏమీ లేవు పో.. అంటూ నాన బూతులు తిడుతూ కూలీలను బెదిరింపులకు గురిచేయడంతో వారు భయాందోనకు గురయ్యారు. అయ్యో సారు అలా మాట్లాడుతున్నారు ఏంటి అంటే.. ఎవరికి చెప్పుకుంటారు చెప్పుకోండి.. కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తారా చేయండి.. ఎమ్మెల్యేకు చెపుకుంటారా చెప్పుకోండి.. అంటూ రమేష్ కూలీల మీదకు విరుచుకు పడ్డారు. ఒక వైపు డబ్బులు రాక, మరో వైపు రమేష్‌కు సమాధానం చెప్పలేక బాధను దిగమింగుకొని ఉపాధి కూలీలు వెనుతిరిగి పోతున్నారు.



### డబ్బులు ఇస్తేనే పనులు చేస్తా..

మీకు తొందరగా పైసలు కావాలంటే డబ్బులు ఇస్తారా అంటూ బేషరతుగా ఆ అధికారి లంచం అడుగుతున్నారు. మీకు డబ్బులు కావాలా.. పని కావాలా.. అయితే రూ. 500 ఇవ్వండని.. పని గంటలో అవుతుందంటూ లంచం తీసుకుంటూ పనులు చేస్తున్నారు. ఇలా ప్రతి రోజు పోస్టాఫీస్ కు వెళ్లిన ప్రతి ఒక్క కూలితో గొడవకు దిగుతూ రేగొండ మండల ప్రజలకు ఉపాధి కూలీలకు పగలే చుక్కలు చూపిస్తున్నారు. రేగొండ మండల కేంద్రంలో రూపు రెడ్డి పల్లి గ్రామానికి చెందిన కొందరు కూలీలు గత నెల రోజుల క్రితం పోస్ట్ ఆఫీసర్ చేతల వల్ల ఉపాధి పనులను బహిష్కరించారు. గ్రామానికి చెందిన మెఫింగ్ చేయాలని ఫీల్డ్ అసిస్టెంట్లు గ్రామ పంచాయతీ కార్యదర్శులు పోస్టాఫీస్ చుట్టూ తిరుగుతున్నా రమేష్ పట్టించుకోవడం లేదు. మండల ఎంపీడీఓ, ఏపీఓ ఎవరూ చెప్పిన నేను సీతయ్యను, ఎవరి మాటా వినను అంటూ అంత నా ఇష్టం అంటున్నారు. ఉన్నత అధికారులకు సమాచారం అందించిన పట్టించుకోవడం లేదని ఎస్పీఎం రమేష్‌ను బదిలీ చేయాలని మండల ప్రజలు వేడుకుంటున్నారు.

# కోదండరాంను కలిసిన సెజ్ అసోసియేషన్ ప్రతినిధులు



**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** తెలంగాణ సెజ్ కాంట్రాక్టర్స్, ఔట్ సోర్సింగ్ వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ 2012 సంవత్సరంలో రిజిస్ట్రేషన్ చేసినట్లు, మలి దశ ఉద్యమ సమయంలో పాల్గొనిన వ్యవస్థాపక కార్యవర్గ సభ్యులకు ప్రభుత్వంచే తగిన గుర్తింపు ఇప్పించాలని జేఏసీసి చైర్మన్ ప్రొఫెసర్ కోదండరాంకు గురువారం వినతి పత్రం అందజేసినట్లు అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు మెతుకు ఉప్పలయ్య తెలిపారు. ఈ సెజ్ అసోసియేషన్ సమైక్యాంధ్ర ప్రదేశ్ లో తెలంగాణ పేరుతో ఏర్పాటైన మొదటి, ఏకైక అసోసియేషన్ అని అన్నారు. భారత దేశములో ఈ అసోసియేషన్ మొదటి వరుసలో ఉందని, తెలంగాణ సెజ్ కాంట్రాక్టర్స్, ఔట్ సోర్సింగ్ వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి తిరందాస్ అశోక్ తెలిపారు. అసోసియేషన్ ఏర్పాటు నిషేధం ఉన్నా కూడా తాము తెలంగాణ పేరు మీద సెజ్ అసోసియేషన్ ఏర్పాటు చేసి జై తెలంగాణ అని మలిదశ ఉద్యమంలో పాల్గొన్నామని పేర్కొన్నారు. ఈ అసోసియేషన్ వ్యవస్థాపక కార్య వర్గ సభ్యులను తాము చేసే సెక్యూరిటీ గార్డ్స్ ఉద్యోగాల నుంచి సంబంధిత యాజమాన్యం ఆకస్మికంగా తొలగించినట్లు ఈ అసోసియేషన్ వ్యవస్థాపక సంయుక్త కార్యదర్శి పి.భీమేశ్వర్ తెలిపారు. తొలగించిన తరువాత రంగారెడ్డి అసిస్టెంట్ కమిషనర్ కార్మిక శాఖ కోర్ట్ రంగారెడ్డి లో కూడా ఫిర్యాదు చేసినట్లు వారు తెలిపారు. తెలంగాణ జేఏసీ అనుబంధ సంఘం ఐన తెలంగాణ ప్రైవేట్ సెక్టార్ ఎంప్లాయిస్ అసోసియేషన్ తో కలిసి తెలంగాణ వచ్చేవరకు పలు ఉద్యమ కార్య క్రమాలలో పాల్గొనట్లు వారు తెలిపారు. మలి దశ ఉద్యమంలో పాల్గొన్న ఈ అసోసియేషన్ వ్యవస్థాపక కార్యవర్గ సభ్యులకు నేటి వరకు ప్రభుత్వంచే ఎలాంటి గుర్తింపు రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు జెల్ల దర్శన్, నిత్యనందం, దుర్గేష్ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా వేణుగోపాల స్వామి తిరు కళ్యాణం

**వరంగల్ వాయిస్, రఘునాథపల్లి :** కోర్కెలు తీర్చే స్వామిగా ఎంతో ప్రసిద్ధిగాంచిన శ్రీ వేణుగోపాల స్వామి కళ్యాణ మహోత్సవం గురువారం అంగరంగ వైభవంగా జరిగింది. రఘునాథపల్లి మండలం కొమ్మల గ్రామంలో ఆలయ అర్చకులు అనిల్ బాబు ఆధ్వర్యంలో పూజారులు వేదమంత్రాలతో కళ్యాణాన్ని జరిపారు. పద్మశాలి కులస్తులు శావ మోశారు. కళ్యాణ వేడుకల్లో గ్రామస్తులతో పాటు వివిధ గ్రామాల చెందిన ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.. అనంతరం భక్తులకు, గ్రామస్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. శ్రీ





వేణుగోపాలస్వామి ఆలయానికి ఎంతో విశిష్టత ఉంది. ప్రతి ఏడాది మూడు రోజులపాటు ఇక్కడ బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తారు. కళ్యాణ సందర్భంగా అశేష భక్త జనం హాజరై స్వామి వారి కళ్యాణాన్ని తిలకించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు గోపాల బాబు, మాజీ సర్పంచులు సుల్తాన్ నరసింహారెడ్డి, వల్లాల అశోక్, వల్లాల ఉపేందర్, పెంట సుమన్, ఉపేందర్, తాటికొండ వెంకటేష్ యాదవ్, కుమార్ స్వామి, తదితరులు పాల్గొన్నారు.

# మంత్రి కోమటిరెడ్డిని కలిసిన ఎమ్మెల్యే నాగరాజు



**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** హైదరాబాదులోని మంత్రుల నివాసంలో రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డితో వర్ధన్నపేట శాసనసభ్యుడు, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు గురువారం మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. అనంతరం ఎమ్మెల్యే తన నియోజకవర్గంలో జరగవలసిన అభివృద్ధి పనులకు గురించి మంత్రి దృష్టికి తీసుకెళ్లగా వారు సానుకూలంగా స్పందించి త్వరితనపనులు ప్రారంభం చేసే విధంగా తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడం జరిగింది. తదనంతరం ఎమ్మెల్యే మంత్రికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ భేటీ సమావేశంలో పెద్దపల్లి శాసనసభ్యుడు చింతకుంట విజయ రామారావు, హనుమకొండ జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షుడు పింగిలి వెంకట్రాం నరసింహారెడ్డితో పాటు తదితరులు పాల్గొన్నారు.

# బడిబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

## కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** జిల్లా కలెక్టర్ కాన్ఫరెన్స్ లో గురువారంబడి బాట కార్యక్రమం పై జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు లెనిన్ వత్సల్ టొప్పోతో కలిసి సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లు పెంచేందుకు విద్యా సంవత్సరం ప్రారంభం లో జూన్ 3 నుంచి 19 వరకు బడి బాట కార్యక్రమాన్ని విజయ వంతం చేయుటకు సంబంధిత శాఖల అధికారులతో దిశా నిర్దేశం చేశారు. రానున్న విద్యా సంవత్సరంలో ఉన్న డ్రాప్ ఔట్స్ లేకుండా ప్రభుత్వ పాఠశాలలో బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించుటకు పాఠశాల ప్రధానోపాధ్యాయులతో పాటు సంబంధిత లైన్ అధికారులు, ప్రభుత్వ పాఠశాలల అడ్మిషన్లు పెంచేలా ప్రతిపాదనలు తయారు చేసి బడి బాటను విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. బడి బాట నిర్దేశించిన ప్రతిపాదనల ననుసరించి సంబంధిత లైన్ డిపార్ట్ మెంట్స్ నిర్దేశిత లక్ష్యాలను సాధించేందుకు దిశా నిర్దేశం చేసి విద్యార్థుల భవిష్యత్ కు బంగారు బాటలు వేయాలన్నారు. సంబంధిత శాఖల అధికారులు జిల్లాను విద్యలో ప్రగతి సాధించేందుకు కృషి చేయాలని అన్నారు. తెలంగాణ సాంస్కృతిక కళాకారులు ఈ బడి బాట కార్యక్రమంలో పాల్గొని చదువుకుంటే కలిగే ప్రయోజనాలను పాటల రూపంలో విద్యార్థులకు అర్థమయ్యేలా అవగాహన కల్పించాలన్నారు.

ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఈఓ నర్మద, డిడబ్ల్యూఓ వరలక్ష్మి, డీపీఓ హరిప్రసాద్, ట్రైబల్ వెల్ఫేర్ డీడీ ఎర్రయ్య, డీఈఓ రామారావు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ బాలరాజు, బీసీ సంక్షేమ అధికారి నరసింహస్వామి, డీఎంహెచ్ఓ డాక్టర్ కళావతి బాయి, మైనారిటీ శాఖ అధికారి శ్రీనివాస్, కార్మిక శాఖ అధికారి రమేష్, కేజీబీవీ అధికారి విజయకుమారి, మెప్మా అధికారులు నళిని, అడిషనల్ డీఆర్డీఓ జయశ్రీ, మునిసిపల్ డీఈ ఉపేందర్ పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే నాగరాజుపై అనుచిత వ్యాఖ్యలు ఖండిస్తున్నాం



**వరంగల్ వాయిస్, వర్ధన్నపేట :** ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు పై స్వేరోస్ స్టూడెంట్ యూనియన్ నాయకులు అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని, స్వేరోస్ నాయకులు అనుచిత వ్యాఖ్యలు చేయడం మానుకోవాలని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఐత ప్రవీణ్ కుమార్ సూచించారు. గురువారం వర్ధన్నపేట మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఐత ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ బహుజన నినాదంతో సబ్బండ వర్గాలను మోసం చేసి దొర కాళ్ల దగ్గర భాంచన్ గిరి చేస్తున్న ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ స్వేరో పేరుతో బహుజనులను మోసం చేశారని ఆరోపించారు. ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ పదవిలో ఉన్నప్పుడు చేసిన అవినీతి అక్రమాలు బయటపడతాయనే భయంతో ముందస్తుగా పదవికి రాజీనామా చేసి రాజకీయాల్లోకి వచ్చారని ఆరోపించారు. తన రాజకీయ స్వార్థం కోసం బహుజన సమాజాన్ని వాడుకున్నది నిజం కాదా అని ప్రశ్నించారు. ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ మాయలో బహుజన సమాజం మగ్గవద్దని సూచించారు.



# సౌమ్యుడు గండి సదయ్య

**సేవా పతాక అవార్డు గ్రహీత**

**శ్రమైక దీప్తి, స్నేహశీలి, నిత్య విధి పిపాసి**

**31న ఉద్యోగ విరమణ**

**సహచరులు, మిత్రులు, బంధువుల శుభాకాంక్షలు**

### విధితో పోరాడి గెలిచారు...

కానిస్టేబుల్‌గా గండి సదయ్య చురుగ్గా పనిచేస్తున్న సందర్భంలో ఓసారి తీవ్ర అనారోగ్యానికి గురయ్యారు. రెండు కాళ్లు, చేతులు చచ్చు పడడంతో ఆయన జీవితం ప్రమాదంలో పడింది. సంవత్సరాలకు కొద్దీ ప్రధాన ఆసుపత్రులు తిరిగారు. అల్లోపతి, ఆయుర్వేదం, హెూమియో మందులు వాడారు. అయినా ఆరోగ్యం కుదుటపడ లేదు. శరీరం సహకరించక పోవడంతో అన్ని దేవుళ్లకు మొరపెట్టుకున్నారు. ఏ దేవుడు వరమిచ్చాడో తెలియదు కానీ, కోమాలోకి వెళ్లిన ఆయన సంకల్ప బలంతో తిరిగి నిలబడ్డారు. అందరూ ఆశలు వదులుకున్న వేళ.. అచంచల విశ్వాసంతో కోలుకున్నారు . తిరిగి మళ్లీ విధుల్లో చేరి ఎప్పటిలాగే సమర్థవంతంగా పనిచేసే పోలీసు ఉన్నతాధికారుల ప్రశంసలు పొందారు.



- గడ్డం కేశవమూర్తి





**అంతఃకరణ శుద్ధితో తన విధులు నిర్వహించడంలో ఆయనకు ఆయనే సాటి. ముక్కుసూటిగా ఉంటూ అక్రమార్కుల గండెల్లో రైళ్లు పరుగెత్తించారు. సౌమ్యుడిగా ఉంటూనే విధి నిర్వహణలో ఏఎస్సై గండి సదయ్య కటువుగానూ వ్యవహరిస్తారనే పేరుంది. జీవితంలో ఒక చిన్న దెబ్బ తగిలితేనే అంతా అయిపోయిందని మనకు మనమే ముగింపు రాసుకుంటాం. కానీ, ఉద్యోగపర్వంలో ఆరోగ్యం దెబ్బతిని చావు అంచుల వరకు వెళ్లిన గండి సదయ్యకు ఆత్మవిశ్వాసం చావలేదు. కష్టాలు, కన్నీళ్లపై తిరుగులేని పోరాటం చేసి జీవితంలో గెలిచి చూపించాడు. విధితో పోరాడి గెలిచారు. నక్సల్స్ ఏరివేత టీంలో గండి సదయ్య సమర్థవంతంగా విధులను నిర్వర్తించి ఉన్నతాధికారుల ప్రశంసలు సైతం పొందారు. తన ఉద్యోగ ప్రస్థానంలో ఎన్నో ఒడిదొడుకులను ఎదుర్కొన్నప్పటికి తన పని తీరుతో ఎన్నో అవార్డులు అందుకున్నారు.**

### బాల్యం- విద్యాభ్యాసం..

ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ప్రస్తుత హనుమకొండ జిల్లా శాయంపేట మండల గంగిరేణిగూడెంలో గౌడ కుటుంబంలో 1963న మే 7న గండి సదయ్య జన్మించారు. తల్లిదండ్రులు సమ్మక్క- కొమురయ్య దంపతులకు ఆయన మొదటి సంతానం. ప్రాథమిక విద్య 1వ తరగతి నుంచి 3 వరకు స్థానిక పాఠశాలలో చదువుకొని, ఒక్క 4వ తరగతి మాత్రం మందారి పేట అమ్మమ్మ ఊరిలో చదువుకున్నారు. అనంతరం 5వ తరగతి నుంచి 7వ తరగతి వరకు జడ్పీఎస్-ఎస్ కొప్పులలో విద్యాభ్యాసం చేశారు. 8 నుంచి 10వ తరగతి వరకు ప్రభుత్వ ఉన్నత పాఠశాల పరకాలలో హాస్టల్లో ఉండి తమ విద్యాబ్యాసాన్ని పూర్తి చేశారు.

### ఉద్యోగ ప్రస్థానం...

1984 డిసెంబర్ 1న పోలీస్ కానిస్టేబుల్‌గా గండి సదయ్య ఉద్యోగ ప్రస్థానం ప్రారంభమైంది. 1985న కుర్చెడ్ ప్రకాశం జిల్లాలో శిక్షణ పొందారు. అనంతరం ఏఎన్ఎస్ లో చెర్ల మండలం తిప్పాపూర్ లో సంఘ విద్రోహశక్తులను ఏరివేత డ్యూటీలో చేరారు. ఆ డ్యూటీలో ఎంతో సమర్థవంతంగా తన విధిని నిర్వర్తించారు. 1985 నవంబర్ 21 ఖమ్మం టూ టౌన్ పోలీస్ స్టేషన్ లో చేరినప్పటికి, మళ్లీ ఏఎన్ఎస్‌లోకి పంపించారు. అలాగే, 1989 జూన్ 22 వరకు డీఎస్పీ ఆఫీస్ ఖమ్మంలో సేవలు అందించారు. అక్కడ నుండి బదిలీపై 1989 జూన్ 22 న గార్ల బయ్యారంకు బదీలిప వెళ్లారు. 1994 జూలై 11న మళ్లీ చర్లకు బదిలీపై వెళ్లి 1996 వరకు తన అమూల్యమైన సేవలు అందించారు. 1996 ఆగస్టు 18న చర్ల నుంచి కొత్త గూడెంకు బదిలీపై వెళ్లి అక్కడ 1999 ఆగస్టు 11 వరకు తమ విధిని సక్రమంగా నిర్వర్తించారు. ఆ తర్వాత 2006 ఆగస్టు 11 వరకు డిప్యూటేషన్ పై యాంటీ పవర్ తెఫ్ట్ స్క్వాడ్ సెల్ గోదావరిఖనిలో సేవలు అందించారు. 2011 జూన్ 18న కొత్తగూడెం త్రీ టౌన్ లో పనిచేసే సమయంలో హెడ్ కానిస్టేబుల్ గా పదోన్నతి పొందారు. అనంతరం 2011 జూన్ 20 నుంచి 2016 జులై 11 వరకు పాల్వంచ రూరల్ పోలీస్ స్టేషన్‌లో తన సేవలందించారు. గుండాల నుంచి సుజాత నగర్‌కు 2016 జులై 21న ఏఎస్సైగా పదోన్నతిపై వెళ్లారు. ఏపీపీఏలో ఎస్సై శిక్షణ సైతం పూర్తి చేశారు. 2023 డిసెంబర్ 19న సుజాతనగర్ పీఎస్ నుంచిలక్ష్మీ నగర్ పోలీస్ స్టేషన్ కు డీసీఆర్బీకి డిప్యూటేషన్ పై వచ్చి తుదకుంటూ తన సేవలు అందించారు. పదవీ విరమణ పొందు వరకు కూడా ప్రతి ఒక్కరికి సహాయం చేయడమే గానీ, సహాయం ఆశించింది లేదు. గండి సదయ్య ఏముహూర్తాన ఖమ్మం జిల్లాలో ఉద్యోగ ప్రస్థానం మొదలు పెట్టారో తెలియదు కానీ, సర్వీసంతా అదే జిల్లాలోనే పూర్తి చేయడం విశేషం.

### సేవలకు గుర్తింపుగా అవార్డులు..

గండి సదయ్య తన వృత్తిలో అంకిత భావంతో పనిచేసినందుకు ఆయన సేవలను గుర్తించిన పోలీస్ శాఖ ఎన్నో అవార్డులు, రివార్డులు అందిజేసింది. సింగరేణి కరెంటు అక్రమ వినియోగం అరికట్టినందుకు18 సెప్టెంబర్ 2003న డా జీసీజీ ఐయ్యంగార్ ఐపీఎస్ చే ప్రశంసాపత్రం అందుకున్నారు. 2005లో ఎస్సీసీఎల్ ఎంప్లాయిస్ క్వాటర్స్ లో షాపులు పెట్టి సింగరేణి విద్యుత్తును కమర్షియల్‌గా వాడేవారిని కట్టడిచేసినందుకు సీఎండీ నుంచి రూ. 5000/- నగదు పురస్కారంతో పాటు ప్రశంసాపత్రం అందుకున్నారు. అక్రమ వినియోగదారులపై కేసులు పెట్టించి శిక్షపడే విధంగా చేసినందుకుగాను 2006లో ఐఏఎస్ అధికారి ఎం.సుబ్రహ్మణ్యం నుంచి ప్రశంసాపత్రం పొందారు. శిక్షపడి పెరోల్ పై బయటకు వచ్చి తప్పించుకు తిరుగు వారిని పట్టుకున్నందుకు నదగు పురస్కారం లభించింది. ఎస్పీ ఏవీ రంగనాథ్, ఐఏఎస్‌లు నరేష్, రాజీవ్ గాంధీ హన్మంతు, కొత్తగూడెం ఎస్పీ అంబర్ కిషోర్ ఝూల నుంచి 2018లో ప్రశంసాపత్రం అందుకున్నారు. డీసీఆర్బీ కొత్తగూడెం నుంచి నగదు పురస్కారం స్వీకరించారు. అప్పటి తెలంగాణ హెూం మంత్రి మహమూద్ నుంచి రాష్ట్ర ఉత్తమ పురస్కారం అందుకున్నారు. 2010 అసెంబ్లీ, పంచాయతీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేటట్లు కృషి చేసినందుకు కొత్తగూడెం ఎస్పీ సునీల్ దత్ చే ఉత్తమ సేవా పథకాన్ని స్వీకరించారు.

### కుటుంబమే ప్రపంచం..

కుటుంబమే ప్రపంచంగా భావించే గండి సదయ్య తన సొంత మేనమామ పూజారి సాంబయ్య-సాంబలక్ష్మి దంపతుల కూతురైన పి. సుజాతను 1984 జనవరి 18న వివాహం చేసుకున్నారు. వారికి కుమారుడు రామకృష్ణ, కోడలు శ్రావణి ఉన్నారు. కొడుకు రామకృష్ణ, కోడలు శ్రావణిలకు సమరజిత్ రామ్ సంతానం. తను విధి నిర్వహాణలో అవిశ్రాంతంగా పనిచేసి ఉద్యోగ విరమణ పొందుతున్న క్రమంలో కుటుంబసభ్యులు, బావమర్ధులు పూజారి విజయ్, శ్రీనివాస్ శుభాకాంక్షలు తెలిపారు. తన శేష జీవితం ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో జీవితాంతం సుఖ, సంతోషంగా ఉండాలని వారు ఆకాంక్షించారు.





# కౌంటింగ్‌కు కట్టుదిట్టమైన ఏర్పాట్లు

**రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ పి.ప్రావీణ్య**
**అధికారులతో కలిసి ఏర్పాట్లపై సమీక్ష**





**వరంగల్ వాయిస్, వరంగల్ :** లోకసభ ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ కోసం కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేపట్టాలని, ఇందులో ఎటువంటి లోటుపాట్లకు తావీయరాదని రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. గురువారం ఏనుమాములా మార్కెట్ యార్డులో వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, అదనపు కలెక్టర్లు రాధిక గుప్తా, సంధ్యారాణి, డీసీపీ రవీందర్, డీఆర్ఓ శ్రీనివాస్ లతో కలిసి కౌంటింగ్ ఏర్పాట్లపై కలెక్టర్ సమీక్షించారు. క్షేత్ర స్థాయిలో పరిశీలించి పక్కడ్బందీ నిర్వహణకు దిశా నిర్దేశం చేశారు. మూడంచెల భద్రత వ్యవస్థ, వాహనాల పార్కింగ్, మళ్లింపు, బారికేడింగ్, పారిశుద్ధ్యం, తాగునీరు, ఎన్నికల సిబ్బందికి కౌంటింగ్ ఏజెంట్లకు భోజనం, నిరంతరాయ విద్యుత్ సరఫరా, వైద్యం, మొబైల్ అంబులెన్స్ అందుబాటులో ఉంచడం, అగ్నిమాపక నివారణ, వాహనాల ఏర్పాట్లు తదితర అంశాలపై సంబంధిత అధికారులతో సమీక్షించి పక్కడ్బందీ నిర్వహణకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జూన్ 4 వ తేదీ ఉదయం ఎనిమిది గంటలకు ఓట్ల లెక్కింపు పక్రియ ప్రారంభమవుతుందన్నారు. ప్రతి రౌండ్‌కు లెక్కింపు వివరాలను డిస్‌ప్లే బోర్డు నందు ప్రదర్శించడంతోపాటు, ఎన్ కోర్ నందు అప్డేట్ చేయడం జరుగుతుందన్నారు. లెక్కింపు పూర్తయిన అనంతరం ఈవీఎంలను తిరిగి స్ట్రాంగ్ రూమ్‌లలో భద్రపరిచి సీల్ వేస్తారని తెలిపారు. రాజకీయ పార్టీలు, వారి ప్రతినిధులు, ప్రజలు ఓట్లు లెక్కింపు సజావుగా పూర్తి చేయడానికి సహకరించాలని కోరారు. అనంతరం విజిటర్స్ రిజిస్టర్ లో వారు సంతకం చేశారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ, జీడబ్ల్యూఎంసీ, ఆర్ డబ్ల్యూ ఎస్, ఆర్ అండ్ బి, అగ్నిమాపక, వైద్య ఆరోగ్య, ఎన్ పీడీసీఎల్, తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

### ఎల్‌బీ కళాశాలలో శిక్షణ..

పార్లమెంట్ ఎన్నికల కౌంటింగ్ ను పురస్కరించుకుని గురువారం వరంగల్ ఎల్ బి కళాశాలలో కౌంటింగ్ సిబ్బందికి నిర్వహిస్తున్న శిక్షణ శిబిరానికి ఆదనవు కలెక్టర్ రాధిక గుప్తా, సంధ్యారాణి లతో కలసి రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య హాజరై పలు సూచనలు చేశారు.

# ప్రభుత్వ కార్యాలయానికి తాళం

**జీతాలు చెల్లించాలంటూ జీపీ ఉద్యోగుల ధర్నా**




**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** మహబూబాబాద్ జిల్లా కురవి మండలం నేరడ గ్రామ పంచాయతీ సిబ్బందికి కడుపు మండింది. గత పది నెలలుగా జీతాలు రాకపోవడంతో ఆగ్రహించిన సిబ్బంది జీపీ కార్యాలయానికి తాళం వేసి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు ఉద్యోగులు మాట్లాడుతూ అసలే చాలీ చాలని వేతనంతో కుటుంబాలను నెట్టుకొస్తుంటే అధికారులు మాత్రం మమ్ములను చిన్న చూపు చూస్తున్నారంటూ మండి పడ్డారు. నేరడ జీపీలో మొత్తం 11మంది సిబ్బంది 1990 సంవత్సరం నుంచి ఉద్యోగాలు నిర్వహిస్తుండగా అందులో ఆరుగురు మల్టీ పర్పస్ ఉద్యోగులకు ఒక్కొక్కరి నెలకు రూ. 9,500, ఐదుగురు ఎన్ఎంఆర్ డైలీ లేబర్ కి ఒక్కొక్కరికి రూ.5 వేల వేతనం చెల్లిస్తున్నారని తెలిపారు. అయితే మూడు రోజుల క్రితం ఎంపీడీవో, ఎంపీవో, కార్యదర్శి, స్పెషల్ ఆఫీసర్ నేరడ గ్రామంలోని నర్సరీని పరిశీలించేందుకు వచ్చిన సమయంలో జీతాలు చెల్లించి ఆదుకోవాలంటూ విజ్ఞప్తి చేశామన్నారు. దీంతో ఆగ్రహించిన ఉన్నతాధికారులు అవాకులు, చెవాకులు పేలారని ఆరోపించారు. అసలు మిమ్ములను ఉద్యోగంలో ఎవరూ చేర్చుకున్నారో వారినే అడుక్కోండి..లేదంటే ఉద్యోగం మానేయండి అంటూ పరుష పదజాలంతో మాట్లాడారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంకా ఇరవై నెలైనా జీతాలు రావు అంటూ దభాయించారన్నారు. దీంతో ఏమీ చేయాలో అర్థం కాక గ్రామ పంచాయతీ కార్యాలయానికి తాళం వేసి ధర్నా చేపట్టామన్నారు. జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి జీతాలు ఇప్పించాలని వేడుకున్నారు. విధులను భహిష్కరించి సిబ్బంది ధర్నా చేయడంతో తాగునీటి సరఫరా నిలిచిపోయింది. దీంతో గ్రామస్తులు నీటికోసం తంటాలు పడ్డారు.

# భద్రకాళిని దర్శించుకున్న టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సుహాసిని



**వరంగల్ వాయిస్, వరంగల్ :** వరంగల్ జిల్లాలో ఎంతో ప్రసిద్ధిగాంచిన భద్రకాళి అమ్మవారిని చలనచిత్ర రంగంలో ఎదురులేని హీరోలుగా వెలుగొందుతున్న నందమూరి కళ్యాణ్ రామ్, నందమూరి తారక రామారావు సోదరీ, తెలుగుదేశం పార్టీ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు నందమూరి సుహాసిని గురువారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు భద్రకాళి శేషు పూజలు నిర్వహించి ఆశీర్వచనం అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ లో తెలుగుదేశం పార్టీ తిరుగులేని మెజార్టీతో గెలిచి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలని అమ్మవారిని కోరుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ రాష్ట్ర మాజీ కార్యదర్శి చిలువేరు రవీందర్ ఆమెను శాలువాతో సత్కరించి బొకే అందజేశారు. ఈ కార్యక్రమంలో కంద్రాతి రాజు, బండారి పూర్ణచందర్, కాంద్రతి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రూప్-1 పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు

**హనుమకొండ జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్**

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** జిల్లాలోని పలు పరీక్ష కేంద్రాల్లో జూన్ 9న నిర్వహించనున్న గ్రూప్-1 పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ సూచించారు. గురువారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష నిర్వహణపై అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ఆమె మాట్లాడుతూ జిల్లాలో ఉన్న అన్ని పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ట భద్రతతో పాటు పరీక్ష కేంద్రాల పరిసర ప్రాంతాలను క్షుణ్ణంగా పర్యవేక్షించాలన్నారు. పరీక్ష పూర్తయ్యేంత వరకూ నిరంతర నిఘా తప్పనిసరి అన్నారు. పరీక్ష కేంద్రాల్లో ఎటువంటి లోటుపాట్లు లేకుండా చూడాలన్నారు. ఈ సమావేశంలో సెంట్రల్ జోన్ డీసీపీ ఎంఎ.భారీ, హనుమకొండ ఆర్డీవో వెంకటేష్, ఆర్టీసీ డీఎం ధరం సింగ్, అన్ని పరీక్ష కేంద్రాల అధికారులు, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

### పాఠశాలలో తనిఖీ..

పరకాలలోని ఉర్దూ మీడియం, ఇదే మండలం కామారెడ్డిపల్లిలోని ప్రభుత్వ పాఠశాలలను హనుమకొండ జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ గురువారం పరిశీలించారు. ఈ పాఠశాలల్లో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఆధ్వర్యంలో కొనసాగుతున్న వివిధ అభివృద్ధి పనులను కలెక్టర్ పరిశీలించారు. అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఆంజనేయులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



# బీఓబీని జఫర్‌గడ్ లోనే కొనసాగించాలి: ఎమ్మెల్యే కడియం

**వరంగల్ వాయిస్, స్టేషన్ ఘన్ పూర్ :** జఫర్‌గడ్ మండలంలోని బ్యాంక్ అఫ్ బరోడా బ్రాంచిని గతంలో స్టేషన్ ఘన్‌పూర్‌కు మార్చారని దీంతో అక్కడి ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని స్టేషన్ ఘన్ పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఆవేదన వ్యక్తం చేశారు. బ్యాంక్ ఆఫ్ బరోడా, జఫర్ గడ్ బ్రాంచిని తిరిగి జఫర్ గడ్ లోనే కొనసాగించాలని కోరుతూ జోనల్ మేనజర్ రితీష్ కుమార్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కడియం మాట్లాడుతూ ఆర్బీఐ అనుమతులు కూడా బ్యాంక్ ఆఫ్ బరోడా జఫర్ గడ్ గ్రామం నుంచి పని చెయాలని ఉందని తెలిపారు. బ్రాంచ్ ఏర్పాటుకు కావాల్సిన మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.

# దత్త క్షేత్రంలో రేపు అనఘాష్టమి వ్రతాలు



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** అవధూత దత్త పీఠాధిపతి, పరమ పూజ్య, జగద్గురు శ్రీ గణపతి సచ్చిదానంద స్వామీజీ దివ్య ఆశీస్సులతో దత్త పీఠ ఉత్తరాధిపతి, పరమ పూజ్య శ్రీ దత్త విజయానంద తీర్థ స్వామీజీ అనుగ్రహంతో ములుగు రోడ్డులోని శ్రీ గణపతి సచ్చిదానంద వరద దత్త క్షేత్రంలో శుక్రవారం 31వ తేదీ ఉదయం 10 గంటలకు సామూహిక శ్రీ అనఘాష్టమి వ్రతాలు నిర్వహిస్తున్నట్లు దత్త జ్ఞాన బోధ సభ వరంగల్ ట్రస్ట్ తెలిపింది. సామూహికంగా వ్రతం చేసుకొను భక్తులు రూ.200 చెల్లించాలన్నారు. పూజ అనంతరం అన్నప్రసాద వితరణ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమానికి భక్తులందరూ ఆహ్వానితులే అని తెలిపారు. గణపతి సచ్చిదానంద స్వామీజీ 82వ జన్మదినోత్సవం సందర్భంగా ఈనెల వైశాఖమాసంలో జరిగే శ్రీ అనఘాష్టమి వ్రతం చాలా విశేషమైనదని పేర్కొన్నారు. వివరాలకు 9246935501, 9347453013 నెంబర్లలో సంప్రదించాలని సూచించారు.

# సీనియర్ ఐఏఎస్ పై వచ్చిన ఆరోపణలను ఖండిస్తున్నాం..

**జనగామ 'గోపా' వ్యవస్థాపక అధ్యక్షుడు పరశురాములు**



**వరంగల్ వాయిస్, జనగామ :** తెలంగాణ విద్యాశాఖ సర్వశిక్ష అభియాన్ లో రూ.2,400 కోట్ల భారీ స్కాంకు స్కెచ్ వేసి, ఇప్పటికే రూ.150 కోట్లు దిగమింగినట్టు సీనియర్ ఐఏఎస్ అధికారి బుర్ర వెంకటేశంపై వచ్చిన ఆరోపణలను గౌడ అఫిషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (గోపా) జనగామ వ్యవస్థాపక అధ్యక్షుడు కన్న పరశురాములు తీవ్రంగా ఖండించారు. నీతి, నిజాయితీ, నిబద్ధతకు ఆయన మారుపేరన్నారు. పలుశాఖల్లో కీలక పదవులను సమర్ధవంతంగా నిర్వహించిన కారణంగానే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వంలో కీలకమైన విద్యాశాఖతో పాటు, ఇతర 5 ముఖ్య శాఖల్లో అదనపు బాధ్యతలు అప్పగించారని గుర్తు చేశారు. ఇది జీర్ణించుకోలేని ఒక వర్గం అవినీతిని అంటగట్టి ఆరోపణలు చేస్తోందన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DIST DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com